

# మీరూ ఆలోచించండి!

— 'వాచస్పతి'

"మీరా, నాన్నా!?" అంది, తలుపు తీసి, రాధ.

మౌనంగా, లోపలికొచ్చాడు సుందరయ్య.

చేతిలో ఉన్న బ్రీఫ్‌కేస్ క్రింద పెట్టి, గోడవారగా ఉన్న మంచంమీద కూచుని, కూతురి ముఖంలోకి కొద్ది క్షణాలు పరీక్షగా చూసి, బరువుగా నిట్టూర్చాడు. తండ్రి చూపులు తప్పించుకుంటూ, వంటగదిలోకెళ్ళి, గ్లాసుతో నీళ్ళు తెచ్చి తండ్రికిచ్చింది, రాధ.

నీళ్ళు త్రాగి గ్లాసు క్రింద పెట్టూ,

"మూడు నెలలు పైనే అయింది జాబువచ్చి... ఏ రోజుకారోజు నీ దగ్గరనుండి జాబొస్తుందని, ఎదురు చూస్తాం... ఏం, ఉత్తరం రాయకూడదనుకున్నావా, తల్లీ?" నిష్ఠూరంగా అన్నాడు.

"రాసేందుకు విశేషాలేం లేవు నాన్నా!"

నవ్వుతూ అన్నా బాధను దాచలేకపోయింది.

"విశేషాలంటే...?"

నేల చూపులు చూస్తూ, మౌనంగా ఉండిపోయింది రాధ.

"నిన్నేనమ్మా, అడుగుతుంది..."

'అదే... మీరు చదువుకుని సంతోషించదగ్గ విషయాలు... పోనీండి! ఇదెప్పుడూ వున్నదేగా! ఇంటి దగ్గర అంతా బాగున్నారా? అమ్మ ఆరోగ్యంగా తిరుగుతుందా?"

"ఊ... అక్కడ మేమంతా బాగానేవున్నాం... ఇక్కడ నీ విషయాలు తెలియకనే కంగారుపడుతున్నాం... మీ క్షేమ సమాచారం కోసం ఎంత ఆత్రంగా ఎదురుచూస్తుంటామో నీకు తెలీదా, తల్లీ?"

జవాబుగా విరక్తిగా నవ్వింది రాధ.

"చెప్పమ్మా!"

"తెలుసు, నాన్నా!" అంటున్నప్పుడు రాధ గొంతు వణికింది.

"తెలిసీ మావట్ల ఎందుకింత నిర్దయగా ప్రవర్తిస్తున్నావు?"

"నిర్దయగా నేను ప్రవర్తిస్తున్నానా,? ఏదీ, బాగా ఆలోచించి, మళ్ళీ చెప్పండి!" వస్తున్న దుఃఖాన్ని మింగి అంది.

"అంటే, మేమే నిన్ను నిర్దయగా చూస్తున్నామా?"

రాధ జవాబు చెప్పకుండా, చూపులు త్రిప్పుకుంది.

గాఢంగా నిట్టూర్చి, "ఊ... పిల్లలేరీ?" అడిగాడు సుందరయ్య.

"ఆడుకునేందుకెళ్ళారు..."

"స్కూలుకెళ్తున్నారా?" కూతురిని మరోమారు నఖశిఖపర్యంతం పరీక్షగా చూస్తూ, ప్రశ్నించాడు.

"ఆ!"

"అల్లుడు గారు...?"

"మామూలే! పదేళ్ళుగా చూస్తున్నదేగా!"

"ఉద్యోగం?... పోయిన నెలలో నేను హైద్రాబాద్‌వెళ్లాను. వాళ్ల బంధువులబ్బాయి కనిపించి ప్రస్తుతం ఉద్యోగమేదీ లేదని చెప్పాడు... ఎంత నిజం?"

"నాకేం తెలీదు... అలాంటి విషయాలు నాకేం చెప్తారుగా? ఉద్యోగం ఎప్పుడో ఊడిపోయిందని నా అనుమానం..."

"అయితే, ప్రస్తుతం ఏం చేస్తున్నట్టు?"

"మగమహారాజులు ఏమైనా చేస్తారు!"

"డొంకతిరుగుళ్లు మాని సరిగ్గా చెప్పకూడదూ?"

"ఇలాంటివాళ్లనంతా కడుపులో పెట్టుకుని, కన్న తల్లిలా చూసేందుకు క్లబ్బుందిగా?"

"అది సరే తల్లీ! మరి జరుగుబాటు...?"

"ఆయన విషయం నాకు తెలియదు... నేను మట్టుకు మీరు పెట్టిన బంగారమంతా అమ్మాను..."

"బంగారమంతా అమ్మిన విషయం సంవత్సరం క్రితమే తెలుసు... ప్రస్తుతం ఇల్లెలా జరుగుతుంది?"

రాధ మాట్లాడలేదు.

ఆమె ముఖం ఎర్రగా కందినట్లయింది.

"కన్నతండ్రి ముందుకూడా దాపరికమేనా?" వేదనతో అన్నాడు సుందరయ్య.

"బంగారం కాక ఇంట్లో ఇంకా కొన్ని వస్తువులుంటాయిగా?"

"ఊ..." బరువుగా నిట్టూర్చాడు.

క్రిందకూలబడి, దోసిట్లో ముఖం దాచుకుని, తనలో తానే కుమిలిపోసాగింది రాధ.

కూతురు దుఃఖం చూసాక, సుందరయ్య హృదయం ముక్కలైంది.

వ్యథాభరిత దృక్కులతో కూతురివేపు చూడసాగాడు.

వలచని చీకటి తెరలు దట్టంగా మారాయి. సుందరయ్య లేచి, ముందుగదిలో లైట్ వేసాడు. ఆడుకు



నేందుకు వెళ్ళిన పిల్లలిద్దరూ లోపలికొచ్చారు. సుందరయ్యను చూడగానే, ఒక పరుగున వెళ్ళి, ఆయన పైకాలి పోయి, మెడచుట్టూ చేతులువేసి, అదే అభిమానపు పాశంగా బంధించారు.

వాళ్ల రూపాలు, బట్టలు చూసిన సుందరయ్య కన్నుల్లో చివ్వున నీరు తిరిగింది.

ఎన్నో అనుమానాలూ, ప్రశ్నలు ఆయన మెదడును గజిబిజి చేసేసాయి.

బ్యాగ్‌నుండి పండ్లు బిస్కట్లు తీసి పిల్లలకిచ్చాడు. వాళ్ళవి తింటున్న తీరుచూసాక, ఆయనకు కూతురి ఇంటి పరిస్థితి చాలావరకు అర్థం అయింది. "పిల్లలకు కడుపునిండా తిండికూడా లేనట్లుంది. పరిస్థితి ఇలా వుందని ఒక జాబుముక్క కూడా రాయలేదు. కన్నవాళ్లనెందుకమ్మా, పగవాళ్లలా చూస్తున్నావు? మేం చేసిన తప్పేమిటి తల్లీ? ఈ విషయం మీ అమ్మకు తెలిస్తే గుండె పగిలి చచ్చిపోదూ?" అన్నాడు డగ్గుత్తికతో.

చివ్వున తలెత్తి చూసింది రాధ.

కన్నీటితో ఆమె చెంపలు మలినమై వున్నాయి.

రోషంతో, అభిమానంతో పెదవులు చలిస్తున్నాయి.

"పోయిన సంవత్సరం పండక్కి వచ్చినప్పుడు, అంటే, సంవత్సర క్రితం, అమ్మతోనూ, మీతోనూ కొన్ని విషయాలు చెప్పాను. గుర్తుందా నాన్నా?" నిష్ఠూరంగా కటువుగా అంది.

"ఊ..." సాలోచనగా.

"అప్పుడు మీరేవన్నారు?" కోపంగా అంది.

"ఏవన్నాం?" అంటూ గతాన్ని అవలోకించే ప్రయత్నం చేసాడు సుందరయ్య.

"చూడు తల్లీ! భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రాకపోవు. ఒకరినొకరు అర్థంచేసుకుని సర్దుకుపోవాలి. ఈ సర్దుబాటు, అర్థం చేసుకోవడం కొందరి విషయంలో చాలా త్వరగా జరుగుతుంది. మరికొందరివిషయంలో సంవత్సరాలు పట్టవచ్చు. నువ్వుకాస్త ఓపిక పట్టాలి, రాధా!" అంది తన భార్య విమల.

"ఆ మనస్పర్థలూ, ఆ కొట్లాటలూ వేరమ్మా! ఇది వేరు. ఈయన నన్నొక మనిషిగా చూడ్డంలేదు. పోనీ, పిల్లల భవిష్యత్తన్నా బాగుపడుతుందేమో అనుకుంటే ఆ, ఆశా నమ్మకమూ రోజు రోజుకూ క్షీణించిపోతున్నాయి... ఆయన వ్యసనాలే ఆయనకు భార్యాపిల్లలూ... మా అవసరం లేదని అనిపిస్తుంది... ఇక అక్కడ ఎందుకుండాలో నాకర్థం కావడం లేదమ్మా!"

"మగవాడు అలాగే అనుకుంటాడు. కానీ, ఆడది అంత తొందరపడకూడదు... భర్తనొదిలిన స్త్రీకి మనశ్శాంతి వుంటుందా? నలుగుర్లో గౌరవం ఉంటుందా? నువ్వే ఆలోచించు..."

"అంటే, ఎలాంటి పరిస్థితుల్లోనూ నా భర్తను వదిలి మీ ఇంట్లో వచ్చి ఉండకూడదు.అంతేనా?" అదోరకంగా నవ్వుతూ ప్రశ్నించింది.

"అదికాదు తల్లీ... నేను చెప్పేది కాస్తవిను..." అంటూ తనేదో చెప్పబోయాడు.

"ఇక మీరేం చెప్పనవసరంలేదు. అంతా అర్థమైంది! ఈ సంఘ స్వరూపం, దాని నీతి, న్యాయం కూడా తెలిసింది. నాగురించి, మీరేం ఆందోళన పడకండి! నా సంసారాన్ని నేను చక్కదిద్దుకుంటాను. ఆ నమ్మకం నాకుంది. బ్రతికితే అక్కడే బ్రతుకుతాను. చచ్చినా అక్కడే చస్తాను." అని రాధ అంటే, విమలా తనూ ఎంతో సంతోషించారు. అమ్మాయికి బాధ్యత తెలిసి వచ్చిందని, భర్త దగ్గరకు సాగనంపారు.

కానీ, రాధ ఆ మాటలన్నీ మనస్ఫూర్తిగా అనలేదని ఇప్పుడర్థమౌతుంది.

ఇక్కడికొచ్చిక నాలుగు జాబులు రాసింది. తర్వాత జాబులు రాయడమే మానుకుంది. విషయం తెలియని తను బయలుదేరి వచ్చాడు.

"అప్పుడలా అన్నాం అనుకో. పరిస్థితులింతలా విషమించాయని నువ్వు చెప్పందే మా కెలా తెలుస్తుంది?"

ఆలోచించడం మాని నిష్ఠూరంగా అన్నాడు.

"చెప్పిమటుకు లాభమేమిటి? మీ అభిప్రాయాలు మారవు! సంవత్సరం క్రితం చేసిన హితబోధే ఇప్పుడు చేయరన్న నమ్మకం ఏముంది? ప్రాణమున్నంత వరకూ ఇక్కడే పడుండాలి! అదే మీకు నాకూ గౌరవప్రదం!"

"బాగుంది తర్కం!"

అని పైకయితే అన్నాడుగానీ, మనసులో తర్జనభర్జన ప్రారంభమైంది.

రాధ అన్నమాటల్లో అసత్యమేమీ లేదు.

అవన్నీ తామన్న మాటలే, తమ మనసులోని మాటలే.

కాని ప్రస్తుతం తనేం చెయ్యాలి?

సంఘం విమర్శిస్తుందనీ, నలుగురూనాలుగు మాటలంటారనీ, భయపడి, రాధనూ పిల్లలనూ ఇలా వదిలి వెళ్లడం ఎంతవరకూ న్యాయం?

తీసికెళ్తే, యీ బంధం పూర్తిగా ఇంతటితో తెగిపోతుందేమో? అది వివేకమైన పనేనా?

ఏమో వదిలివెళ్లడం వివేకవంతమైన పనా?

రాధ ఎంతో ధైర్యవంతురాలు గనకే ఇంతవరకు ఏ అఘాయిత్యానికీ తలపడలేదు.

కానీ, ఇలాగే పరిస్థితులు కొనసాగితే, అలాంటి రోజు ఎంతో దూరంలో లేదనిపిస్తుంది.

అల్లుడు వ్యసనపరుడూ, అయోగ్యుడూ అయితే, కూతురి సంసారం నాశనమైతే, ఆమెను చేరదీయటం నేరమౌతుందా? పదేళ్లు పాపం, పిల్లలకోసం, ఆ వ్యసనపరుణ్ణి భరించింది. రేపొకవేళ రాధ ఆత్మహత్య చేసుకుంటే, ఆ పాపంలో సగభాగం తనదికాదా?

ఆమెను ఆమె ఖర్మకొదిలేయడం అమానుషం కాదా? నిండు ప్రాణాలు తీసుకుంటున్నా చూస్తూ ఊరుకోవడం రాక్షసత్వం కాదా?

నిండునూరేళ్ల జీవితాన్ని సమాధి చేసుకోమని, శాసించడం ఏం న్యాయం? ఆ అధికారం ఎవరికుంది? ఇలాంటి ఆడపిల్లల విషయంలో సంఘమెందుకింత నిర్దయగా వుంది?

వాళ్లు నిలువునా ప్రాణ త్యాగం చేసుకుంటున్నా చూస్తున్నారేగాని, ఇసుమంతయినా కనికరం చూపడంలేదు—చుట్టూవున్న జనం. నీతి బోధతో ఆకలి తీరుతుందా?... కనికరం ఎవరు చూపాలి?

తండ్రిగా తను చూపాలి.... అందరికీ ఏం పట్టింది? చీకటిలో తడుముకుంటున్న తన కూతురికి వెలుగుబాటను చూపాలి. ఆ పసిమొగ్గలు రాలిపోకుండా, వికసించాలి. అది తన బాధ్యత... కర్తవ్యం... కాదనుకోవడం

ఆత్మవంచన, పిరికితనం, రాక్షసత్వం.

అవును...

ఆలోచనలోనుండి తేరుకుని, పిల్లలవేపు చూసాడు. వాళ్లప్పటికి జారుకున్నారు.

అస్థిపంజరాల్లా ఉన్న వాళ్లను చూడగనే కన్నుల్లో చివ్వున నీరు తిరిగింది.

కోపం, ఆవేశం, పట్టుదల క్రమంగా మాయమై, వాటి స్థానంలో వివేకం, ఆలోచన, అభిమానం చోటుచేసుకు న్నాయి—తండ్రీకూతుళ్లిద్దరిలోనూ.

"లేమ్మా! లేచి ముఖం కడుక్కుని రెండు పండ్లుతి ను. అతనొస్తాడా, ఇప్పుడు?"

"చెప్పలేను"

"ఇంటిముఖం చూసి ఎన్నాళ్లయింది?"

"పదిరోజుల పైనే అయింది?"

"ఎక్కడుంటాడో తెలుసా? నేవెళ్లి మాట్లాడి వస్తాను."

"మీకు దణ్ణం పెడతాను, ఆ పనిచేయకండి!"

"సరే, నీ ఇష్టం!"

"ఇంతకూ నా విషయాలేనా? ఇంటిదగ్గర విషయా లు చెప్పండి! మధుకు సంబంధం కుదిరిందా?"

"కుదిరిందమ్మా! ముందా విషయమే చెప్పాలనుకు న్నాను. కానీ, నీ ముఖం చూసాక ఆ విషయమే మరిచిపోయాను."

"అబ్బాయి గుణగణాలు బాగా విచారించారా...?"


"ఆ! నీ విషయంలో చేసిన పొరపాటుకూ తొందరపా టుకు కుమిలిపోతున్నాను... మళ్లీ త్వరపడడమా? అయినా, పెళ్లప్పటికి సలక్షణంగా వున్న అబ్బాయిలు, తర్వాత మారరన్న గ్యారంటీ ఏముంది? మన చేతిలో ఏం లేదు. అందరం 'విధి' చేతుల్లో కీలుబొమ్మలం! ఎవరికెంత ప్రాప్తమో, ఏది ప్రాప్తమో అదే లభి స్తుంది..."

"అలా అనుకుంటే తృప్తి!" హేళనగా అంది.

"పోనీలేమ్మా! మధ్య మనకు వాదన ఎందుకు?" అని తన నిర్ణయమేమిటో చెప్పాడు సుందరయ్య... రాధ ఆలోచనలో పడింది.

* * *

## రంగస్థల నటి శకుంతల



పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు శకుంతల తన ఐదవ యేటనే 'చింతామణి' నాటకంలో చిన్ని కృష్ణుడుగా రంగస్థల ప్రవేశం చేసింది. తన ఏడవ యేట స్థానం నరసింహారావుగారిచే 'రోజ్ ఆఫ్ స్టేజ్' అన్న మెప్పును సంపాయించింది. 27 సంవత్సరాలు రంగస్థల నటిగా సుప్రసిద్ధులు కాళిదాసు కోటేశ్వరరావు, స్థానం నరసింహారావు, కె. రఘురామయ్య, శివరామరెడ్డి, జి. యస్. ఆర్. మూర్తి, మొక్కపాటి, సరస్వతీ రామారావు వంటి వారితో నటించింది.

శకుంతలకి భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలలో ప్రవేశం వుంది. ఆమె పుట్టి పెరిగింది తెనాలిలో. ఆ తర్వాత నాటకాలలో నటిస్తూనే చీరాలలో నటరాజ నృత్య కళా నికేతన్ పేరిట ఓ స్కూల్‌ని కూడా నడిపారు.

రంగస్థలంపై ఈమె పేరెన్నిక గన్న పాత్రలు చింతామణి, సత్యభామ, సీత, శబరి, నాగమ్మ, మురి; సాంఘిక నాటకాలు మరో మొహంజదారో, కనకపుష్యరంగం, సిద్ధార్థ, జైభవానీ, కీర్తిశేషులు, రాగరాగిణి—వంటివేకాక, వివిధ చారిత్రక, పౌరాణిక నాటకాలలో భిన్న విభిన్న పాత్రలు ధరించి ప్రముఖుల ప్రశంసలు చూరగొన్నారు. ఈమె వివాహిత.

"ఇటీవలే మద్రాసులో స్థిరపడిన తర్వాత ఒక ప్రక్క రంగస్థల నటిగా నటజీవితాన్ని కొన సాగిస్తూనే అవకాశాలు లభిస్తే కారెక్టర్ నటిగా చిత్రసీమలో ప్రవేశించాలని ఆశిస్తున్నాము!" అన్నారు శకుంతల.

—ఐ. కె. దుర్గ

## కథాచర్చ

ఈ కథచదివి—మీరు ఆలోచిస్తే, తండ్రి ఏం నిర్ణయం తీసుకుని వుంటాడు? రాధ ఆ నిర్ణయాన్నిబట్టి తన భవిష్యత్తు గురించి ఎలాంటి నిర్ణయం తీసుకుని వుంటుంది? అన్న విషయంలో రకరకాల భావాలు మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరిచే స్తాయి. ఎంచేతంటే, ఇదో పెద్ద సమస్య. చాలా కుటుంబాలు ఇలాంటి సమస్యలను ఏదో ఒక సందర్భంలో ఎదుర్కోవడం అందరికీ తెలిసిన విషయమే.

నిజానికి రచయిత్రి శ్రీమతి 'వాచస్పతి' కూడా ఈ కథకు ఒకముగింపు యిచ్చారు: ఐతే, పాఠకులు ఈ సమస్యలు ఏ కోణంలో ఆలోచించి పరిష్కారం నిర్ణయిస్తారో చర్చించడం ఆసక్తిదాయకంగా వుంటుందనే ఉద్దేశంతో ఈ 'కథాచర్చ'లో పాఠకుల ను పాల్గొనవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

సాధారణంగా రాధ సమస్యకు పరిష్కారం మూడు విధాలుగా వుండడానికి ఆస్కారం వుంది. భర్త పెట్టే బాధలను భరిస్తూ, అతన్ని మార్చాలనే ఆలోచనకు ప్రతిరోజూ ప్రాణం పోయడం ఒక ముగింపు. పిల్లలను తీసుకుని తండ్రితోపాటు పుట్టింటికి వెళ్లిపోయి అక్కడే స్థిరపడిపోవడం రెండవపద్ధతి. తనను లెక్కచెయ్యని భర్తతో బాధ లుపడడం, తననో అదనపు బరువుగా భావించే తల్లిదండ్రులకు 'మరోసమస్య'గా మిగిలిపోవ డం—ఈ రెండువిధానాలూ సరైనవి కావనే నిర్ణ యంతో ఇతరులెవరిమీద ఆధారపడకుండా తనే స్వయంగా, స్వశక్తితో పిల్లలను పెంచి పెద్దచేయ డం—మూడవ ముగింపు.

ఇప్పుడు చెప్పండి.

మీరే రాధ అయితే ఏం చేస్తారు? మీరు తీసుకునే నిర్ణయాన్ని ఒక పేజీకి (అరఠావు సైజులో) మించకుండా, అది ఈ కథకు ఒక ముగింపుగా రాసి పంపించండి. రచయిత్రి ము గింపుకి దగ్గరగా రాసినది, సరైన ముగింపుగా ప్రకటించి, ఆ ముగింపు అందరికంటే బాగా రాసిన పాఠకురాలికి పారితోషికంకూడా పంపిస్తా ము. దాంతోపాటు అటువంటి ముగింపునే రాసిన వారి పేర్లను కూడా ప్రకటిస్తాము.

ఈ 'కథాచర్చ'లో పాల్గొనడానికి ఆఖరు తేదీ మే 5.

త్వరపడండి. మీ హృదయానికి మేధకూ పని కల్పించండి.